క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌కు శుభాకాంక్షలు



సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు స్థానిక అధికారులు గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో సబ్‌కలెక్టర్‌ను కార్యాలయపు పరిపాలనాధికారి కె.వసుంధర, ఇతరశాఖల అధికారులు కలిసి పూల మొక్కలు, బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈ కొత్త సంవత్సరం అన్నివర్గాల ప్రజలకు కలిసి రావాలని, అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోండి



మెటీరియల్ పంపిణీ చేసిన ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం టీకే శ్రీనివాస్ సూచించారు. అర్‌జి నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఎస్టీయూ నాయకులు గురువారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అకడమిక్ కమిటీ మెంబర్ మహాదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, ఈరప్ప, దాసన్న తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఉపయోగకరం

కౌతాళం: స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరం అని హోల్వి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సారథిశర్మ అన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ఎస్టీయూ ఆధ్వర్యంలో తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను గురువారం పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి రామచంద్ర, తిమ్మన్న, నాగమద్దయ్య, రంగస్వామి, శ్రీనివాసులు, భగీరథి తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు



అలంకరణలో దర్గా

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలను సమర్పించి ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

రోడ్డు డివైడర్ పనుల పరిశీలన



పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సర్కిల్ వద్ద రోడ్డు డివైడర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సర్కిల్ వద్ద రోడ్డు డివైడర్ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. రోడ్డు డివైడర్ పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



నాగలదిన్నె సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం : సచివాలయాల సిబ్బంది గ్రామస్తులకు అందుబాటు ఉండి మెరుగైన సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని గురజాల, నాగలదిన్నె గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సహకార పరిపతి సంఘంలో ఖాతాదారుల ఈ–కేవైసీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమయపాలన పాటించాలని, ప్రతి సచివాలయ ఉద్యోగి బయోమెట్రిక్ వేయాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి నొసన్న పాల్గొన్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- పట్టణంలో తరచూ ట్రాఫిక్ జాం
- రోడ్ల పైనే వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్ స్టేషన్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ప్రజలకు తప్పని అవస్థలు



పట్టణంలోని గోనెగండ్ల రోడ్డు పూల బజారు వద్ద స్తంభించిన ట్రాఫిక్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రధాన కూడళ్లలో రద్దీ పెరిగిపోవడం, రోడ్లపైనే బైకులు, ఆటోలు పార్క్ చేస్తుండటంతో పాదచారులు, ఇతర వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. దీనికితోడు పోలీసు శాఖలో సిబ్బంది కొరత కారణంగా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించలేకపోతున్నారు.

దుకాణాల ముందే పార్కింగ్..

ఎమ్మిగనూరు పట్టణ జనాభా రోజు రోజుకు పెరిగిపోతోంది. ప్రస్తుత జనాభా 1.39 లక్షలకు పైగా చేరుకుంది. పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల వారు వ్యాపారం, ఇతర పనుల కోసం వస్తుంటారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లైన సోమప్ప, శివ, వైఎస్సార్‌ఢ్ వాల్మీకి, సోమేశ్వరి, శ్రీనివాస, గాంధీ సర్కిల్స్‌తో పాటు పూల బజారు, గోనెగండ్ల రోడ్డ్, బంగారు బజార్, కూరగాయల మార్కెట్ రోడ్డు, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న దుకాణ సముదాయాలు, ఆర్టీసీ బస్టాండ్ ముందు నిత్యం వాహనాలు రద్దీగా ఉంటుంది. వస్త్ర, కిరాణం, ఎరువుల దుకాణాలు, సెల్ ఫోన్ల దుకాణాలకు వ్యాపారం కోసం వచ్చే ప్రజలు స్థలం లేకపోవడంతో తమ వాహనాలను దుకాణాలు ముందే నిలుపుకుంటుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఆదివారం సంత వచ్చిందంటే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్ర తరం అవుతుంది. పండగల సందర్భాల్లో జనం రద్దీ వల్ల ట్రాఫిక్ స్తంభించడం పరిపాటిగా మారింది.

భారీ వాహనాలు తోపుడుబండ్లతో సమస్య జటిలం..

భారీ వాహనాలు పట్టణంలోని రాత్రి పూట కాకుండా పగటి పూట వ్యాపార సముదాయాల దగ్గర సరుకులు దింపటానికి వస్తుంటంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. ఆటోలు, మోటార్ బైక్‌లు, ఇతర వాహనాలు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండటం, వీరికి తోడు తోపుడ బండ్లు రోడ్డు మధ్యలోకి వస్తుండటంతో సమస్య ఇంకా తీవ్ర తరం అవుతుంది.



గాంధీ సర్కిల్లో రోడ్డుపై నిలిపిన వాహనాలు

ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారిస్తాం



పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారిస్తాం. ఎస్‌ఐ పోస్ట్ భర్తీ, సిబ్బంది కొరతపై జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను పరిష్కరించేందుకు వ్యాపారులు, ప్రజలకు, వాహనాదారులకు కౌన్సెలింగ్ ఇచ్చే చర్యలు చేపడతాం. వ్యాపారులు, వాహనాలు నిబంధనలు పాటించాలి, తోపుడుబండ్ల రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటాం. త్వరలో ట్రాఫిక్ సమస్య పరిష్కించేందుకు తగు చర్యలు చేపడతాం.

– వి. శ్రీనివాసులు, టౌన్ సీఐ, ఎమ్మిగనూరు

11 నెలలుగా భర్తీ కాని ట్రాఫిక్ ఎస్‌ఐ పోస్ట్

పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 11 నెలలుగా ఎస్‌ఐ పోస్ట్ ఖాళీగానే ఉంది. స్టేషన్లో ఒక ఎస్‌ఐ, 8 మంది పోలీసు కానిస్టేబుళ్లు ఉండాలి. అయితే ఎస్‌ఐ పోస్ట్ ఖాళీ, 8 మంది కానిస్టేబుళ్లలో నలుగురు మాత్రమే మిగిలారు. ఇందులో డీఎస్పీ కార్యాలయంలో ఒకరికి డ్యూటీ వేయడంతో ఉన్న ముగ్గురు కానిస్టేబుల్స్ పట్టణం అన్ని చోట్లా ట్రాఫిక్ కంట్రోల్ చేయడం అసాధ్యం. ఉన్న ముగ్గురు కానిస్టేబుల్స్ శివ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర డ్యూటీ చేస్తే మరోక కానిస్టేబుల్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుంటారు. ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ఎస్‌ఐ పోస్టను భర్తీ చేసి, సిబ్బందిని నియమించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దకడబూరు : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరై వారి గ్రామాలలో నెలకొన్న సమస్యలను తెలియజేయాలన్నారు.

దాయాదుల ఘర్షణ.. నలుగురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోన టీఎస్ కూళ్లూరు గ్రామంలో గురువారం రాత్రి ఇంటి పక్కన ఉన్న చెట్లు విషయంలో దాయాదులైన బోయ పెద్ద ఈరన్న, బోయ రామచంద్ర కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలు అయ్యాయి. గ్రామానికి చెందిన బోయ పెద్ద ఈరన్న, బోయ రామచంద్రలు దాయాదులు. రెండు ఇళ్ల మధ్య ఉన్న చెట్లను బోయ రామచంద్ర నరకివేయడంతో ఇరు కుటుంబాల మధ్య గొడవకు దారి తీసింది. రెండు కుటుంబాలు ఒకరిపై మరొకరు దాడులు చేసుకోవడంతో బోయ రామచంద్ర, బోయ చంద్రశేఖర్‌ల, మరో బోయ పెద్ద ఈరన్న, జయరామ్‌లకు గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై విచారిస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని లీలాస్ పాఠశాల విద్యార్థి ధీరజ్ రెడ్డి అండర్–14 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి, కార్యదర్శి ప్రతిభా బాయ్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల అమలాపురంలో జరిగిన అండర్–14 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో ధీరజ్ రెడ్డి, నాగి శంకర్ రెడ్డి ప్రతిభను చాటినట్లు వారు తెలిపారు. ఇందులో ధీరజ్‌రెడ్డి అద్భుతమైన ప్రదర్శనతో 280 పరుగులు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, డీఈఓ శామ్యూల్ పాల్ అభినందించారని చెప్పారు. ధీరజ్‌రెడ్డి ఈ నెల 23వ తేదీన పాట్నాలో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటాడని తెలిపారు. ధీరజ్ రెడ్డిని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టారమేష్, కార్యదర్శి వెంకటేష్ కోచ్ బాలాజీ వారిని అభినందించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



ఏపీటీఎఫ్ డైరీలను ఆవిష్కరిస్తున్న ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి

ఆదోని సెంట్రల్: అందరు కలసి కట్టుగా విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి తెలిపారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) డైరీలను సంఘం నాయకులతో కలసి గురువారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విద్య అభివృద్ధి చెందాలి అంటే ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని, వారికి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు ఎమ్మిగనూర్, గోనెగొండ్ల మండల విద్యాధికారులు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు పూర్వ ఉపాధ్యక్షులు రఘురామయ్య, విశ్రాంత ఎంఈఓ శివరాములు, నాయకులు వెంకటేశ్వర్లు, రామన్న, ముత్తన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

గోనెగండ్ల : ఉపాధ్యాయ సమస్యల కోసం ఎస్టీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందని సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్టీయూ 2025 నూతన సంవత్సరానికి సంబంధించిన డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల గౌరవ, అధ్యక్షుడు విజయ భాస్కర్, రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శి గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంఈఓలు



యూటీఎఫ్ డైరీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

పెద్దకడబూరు: ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిని ఉత్తమంగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు సువర్ణల సునీయం, రామ్మూర్తి సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాల ఆవరణంలో గురువారం యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్, అధ్యాపక దర్శినిలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలన్నారు. యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొలన్న మాట్లాడుతూ యూటీఎఫ్ డైరీ, అధ్యాపక దర్శిని, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎన్నో సందేహాలను నివృత్తి చేస్తుందన్నారు. ఈ నెల 5, 6, 7, 8 తేదీలలో కాకినాడలో జరిగే యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శేకన్న, మల్లికార్జున, అహ్మద్, హుసేని, విక్టోరియమ్మ, సునీత, విమల, హేమ, అశోక్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌ను శిక్షించాలి

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన లైబ్రేరియన్ మద్దిలేటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు మారుతి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. బాలికలకు రక్షణ లేకుండా పోతుందని, గురుకుల జూనియర్ కాలేజీలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే లెక్చరర్లపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వంశీ, శశి, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధరూఢ స్వామి జ్యోతి యాత్ర



కోసిగిలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



ప్రత్యేక వాహనంలో సిద్ధరూఢ స్వామి జ్యోతి యాత్ర

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో సిద్ధరూఢ స్వామి మహా స్వాముల ఆరూఢ జ్యోతి రథయాత్ర శోభయానంగా సాగింది. గురువారం కోసిగి ఆశ్రమం భక్తాదులు ఆధ్వర్యంలో రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. మార్కండేయ స్వామి ఆలయం నుంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, మహిళలు కలసాలతో రేణుక ఎల్లమ్మ ఆలయం నుంచి ఆశ్రమం వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఈ రథయాత్ర సిద్ధరూఢ మహా స్వామి జన్మస్థలం కర్ణాటక రాష్ట్రం చళికాపుర గ్రామం నుంచి బయలు దేరి కోసిగికు చేరినట్లు భక్తులు తెలిపారు. ఆశ్రమంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు రథయాత్ర దర్శించుకుని పూజలు చేసుకున్నారు. జ్యోతి యాత్ర కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలలో వెలసిన సిద్ధరూఢ స్వామి ఆశ్రమాలను సందర్శించి మహా శివరాత్రి రోజున తిరిగి స్వామి వారి జన్మస్థలానికి చేరుకుంటుదన్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

గోనెగండ్ల : ప్రతి గ్రామంలో ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని ఈఓఆర్డీ అనంతసేన సూచించారు. గురువారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. పెద్దనేలటూర్ గ్రామసభలో ఈఓఆర్డీ మాట్లాడుతూ మార్చి చివరిలో ప్రతి గ్రామ పంచాయతీలో వందశాతం ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేయాలన్నారు. పన్నుల విషయంలో అధికారులేవరు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. గ్రామాల్లో తాగునీటి, పారిశుద్ధ సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సర్పంచ్ సోమన్న, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

నందవరం : గ్రామ సర్పంచులు, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో గ్రామాలభివృద్ధికి కృషి చేయాలని ఈఓపీఆర్డీ సందీప్ సూచించారు. గురువారం మండల కేంద్రం నందవరంతో పాటు హాలహర్వి, నాగలదిన్నె, ముగతి తదితర గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి వసతులపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునెమ్మ, పంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలి

ఆదోని రూరల్: రజకుల కోసం గతంలో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక సంక్షేమం, అభివృద్ధి సంస్థ (కార్పొరేషన్) చైర్ పర్సన్ సావిత్రి కోరారు. గురువారం విజయవాడలోని బీసీ భవన్‌లో కార్పొరేషన్ డైరెక్టర్ల పదవీ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రజకులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా, సామాజికంగా ఎదగాలన్నారు. రజక వృత్తిదారులకు అనేక జీవోలు ఇచ్చారని, ఆ జీవోలన్నీ తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీ



బాలికల పాఠశాలలో విద్యార్థులను విచారిస్తున్న సామాజిక తనిఖీ బృందం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బాలికల ఉన్నత పాఠశాల, కస్తూరీ బా గాంధీ బాలికల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లలో సామాజిక తనిఖీ చేపట్టారు. గురువారం కోసిగిలోని ఆయా పాఠశాలలో సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ నాగరాజు ఆధ్వర్యంలో మూడు టీమ్‌లు ఏర్పడి ఒకే సారి ఆయా పాఠశాలలో డీఆర్‌పీలతో తనిఖీ చేపట్టారు. ఇందులో విద్యా సంవత్సరం ప్రారంభం నాటి నుంచి విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం, కొందరు భోజనం సరిగ్గా లేక ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవడం, మౌలిక వసతులు, విద్యార్థుల ఇబ్బందులు, తరగతి గదుల నిర్మాణం తదితర విషయాలపై రెండు రోజులపాటు తనిఖీ చేపట్టనున్నట్లు స్టేట్ రిసోర్స్ పర్సన్ తెలిపారు. డీఆర్‌పీలు ఉరుకుందు, యువరాజు, బాబయ్య పాల్గొన్నారు.

16 నుంచి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో జరుగనున్న శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం ఈనెల 16వ తేదీ నుంచి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన (బండలాగుడు పోటీలు) నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో ఆయా పోటీల పోస్టర్లను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈపోటీలు ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా ఫుట్‌బాల్, వాలీబాల్ తదితర క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



ప్రార్థన చేస్తున్న ఎంఈఓ రామ్మూర్తి, హెచ్‌ఎంలు

పెద్దకడబూరు : పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు సమష్టిగా కృషి చేయాలని ఎంఈఓ రామ్మూర్తి సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం ఒక్కరోజు స్కూల్ మేనేజ్‌మెంట్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలు గురించి చర్చించారు. బాలల హక్కులు, పరిరక్షణ, సమావేశాల నిర్వహణ, పాఠశాల అభివృద్ధిపై ప్రణాళిక, పాఠశాల సామాజిక తనిఖీ, ప్రజల భాగస్వామ్యము తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు రామన్న, నాగరాజు, తులసీరామ్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి కృషి చేయాలి

కోసిగి: ప్రతి పాఠశాలలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు పాఠశాల యాజమాన్య కమిటీ, పాఠశాలల హెచ్‌ఎం సమన్వయంలో బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీడీఓ పి.వెంకటేశ్వర్లు, ఎంఈఓ–2 శోభరాణి సూచించారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, యాజమాన్య కమిటీ చైర్మన్‌లతో కలిసి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, డీఆర్‌పీలు రాజమౌళి, రాజేష్, శంకర్, సీఆర్‌పీలు అనంతరామ్, యోహన్, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌పై చర్యలు తీసుకోవాలి



బుట్టారేణుక, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని బనవాసి గురుకుల కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన లైబ్రేరియన్‌పై అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక డిమాండ్ చేశారు. గురువారం ఆమె మాట్లాడుతూ మహిళా కళాశాలల్లో మహిళా అధ్యాపకులు, సిబ్బందినే నియమించాలని సూచించారు. శాంతిభద్రతలు, మహిళల రక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈ సంఘటనపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కళాశాల ఘటనపై మీడియాలో కథనాలు వచ్చినా, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నా ఉన్నతాధికారులు కళాశాల వైపు తొంగిచూడకపోవడం శోచనీయమన్నారు. దీనిని బట్టి కూటమి ప్రభుత్వంలో మహిళలు, విద్యార్థినులకు ఎలాంటి రక్షణ ఉందో అర్థమవుతోందన్నారు. సత్వరం ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడా మైదానాలను రక్షించండి



హెచ్‌ఎం ఉమా రాజేశ్వరికి వినతిపత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

పెద్దకడబూరు : విద్యార్థులు ఆడుకునే క్రీడా మైదానాలకు రక్షించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాజేశ్వరికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడల అభివృద్ధి కోసం క్రీడా పాలసి ప్రకటించి జాతీయ క్రీడలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తుంటే పెద్దకడబూరు మండల కేంద్రంలో మాత్రం అందుకు భిన్నంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మండలంలో ఎక్కడా లేని విధంగా పెద్దకడబూరు ఉన్నత పాఠశాలకు ప్లే గ్రౌండ్ ఉందన్నారు. గదుల నిర్మాణం పేరుతో కొంతమంది రాజకీయ నాయకులు గ్రౌండ్‌ను కబ్జా చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. గదుల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టడం ఎంతవరకు న్యాయమన్నారు. తక్షణమే గదుల నిర్మాణం ఆపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మోషి, మూర్తి, ప్రభాకర్, విజయ్, సల్మాన్, తలారి రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వేలాడుతున్న యమపాశాలు



కిందకు వేలడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న సీపీఐ నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని కుంటనహాల్ గ్రామంలో రావిహాళ్ల వెళ్లే రస్తాలో ఉన్న కాలనీలో కరెంటు తీగలు చేతికందే ఎత్తులో కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. కాలనీలోని సిద్ధమల్లన్నగౌడ్ ఇంటి వద్ద స్తంభాలు పక్కకు ఒరిగిపోవడంతో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. స్తంభాలు, తీగల వల్ల ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, వీటి ఎత్తు పెంచాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న కోరుతున్నారు. ఈ విషయం ఏఈ దృష్టికి తీసుకెళ్లి రెండు నెలలు గడిచినా పరిష్కారం కాలేదన్నారు. ఈ ప్రాంతంలో స్తంభాలు మార్చి, విద్యుత్ తీగల ఎత్తును పెంచాలని కాలనీ వాసులు వీరయ్యస్వామి, వన్నూరప్ప, సిద్ధమల్లన్నగౌడ్ విజ్ఞప్తి చేశారు.

గ్రామసభతో సమస్యలకు పరిష్కారం



గ్రామసభ నిర్వహిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

కౌతాళం: గ్రామసభతో గ్రామంలో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సర్పంచ్ పాల్‌దినకర్ అన్నారు. గురువారం స్థానిక సచివాలయం–1వద్ద కార్యదర్శి శివప్ప అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా గత సంవత్సరం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో జరిగిన పనులు, రాబోయే రోజుల్లో చేపట్టవలసిన పనుల గురించి చర్చించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, అలాగే ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సభలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.